క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్ల: పట్టణ శివారు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని 'సెస్' సిరిసిల్ల టౌన్-1 అసిస్టెంట్ ఇంజినీర్ సోమవారం తెలిపారు. సిరిసిల్ల టౌన్-3లో చిన్న బోనాల ఫీడర్ 11 కేవీ లైన్ నిర్వహణ కారణంగా చంద్రంపేట, జ్యోతినగర్, చిన్నబోనాలలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని ఏఈ కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: రానున్న విద్యా సంవత్సరంలో ప్రవేశాలకోసం జిల్లాలోని రెప్యూటెడ్ ప్రైవేట్ జూనియర్ కళాశాల నిర్వాహకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీడీవో విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. రెసిడెన్షియల్ సౌకర్యంతో పాటు ఐదేళ్ల అకాడమిక్ రికార్డు, ఉత్తీర్ణత, పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే సంస్థలు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈపాస్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 30లోపు పంపించాలన్నారు. ఎంపికైన కళాశాలల్లో ప్రవేశాలు పొందే విద్యార్థులకు ట్యూషన్ ఫీజు కింద రూ.35వేలు, ప్యాకెట్ మనీగా ఏడాదికి రూ.3వేలు అందజేస్తామన్నారు.

బద్దిపోచమ్మకు ఘనంగా బోనాలు


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న పెగడపల్లి యాదవ సంఘం మహిళలు, నాయకులు

వేములవాడ: పెగడపల్లి మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో వేములవాడలో బద్దిపోచమ్మకు సోమవారం ఘనంగా బోనాలు సమర్పించారు. ఆలయ వసతి గదుల నుంచి నెత్తిన బోనాలతో సంఘం మహిళలు, నాయకులు ఒగ్గుడోలు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పలు గ్రామాల్లో వడగళ్ల వాన


ఎగ్లాస్‌పూర్‌లో కురుస్తున్న వడగళ్లు

కోనరావుపేట: నిమ్మపల్లి, వట్టిమల్ల, ఎగ్లాస్‌పూర్ గ్రామాల్లో సోమవారం సాయంత్రం వడగళ్ల వాన కురిసింది. ఆయా గ్రామాల్లో కురిసిన వడగళ్లకు చేతికందిన వరిపంటలు నష్టపోయాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు తడిసిపోయాయి.

బాలరాజుపల్లిలో 'బడిబాట'

వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండలంలోని బాలరాజుపల్లిలో బడిబాట కార్యక్రమం ప్రధానోపాధ్యాయుడు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని, నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, అన్ని సౌకర్యాలు ఉన్నాయని పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేశం, ఉపాధ్యాయులు మధుకర్, రఘు, లతిక ఉన్నారు.

మేడేను విజయవంతం చేయాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న కార్మికులు

బోయినపల్లి: మేడే విజయవంతం చేయాలని రూపొందించిన కరపత్రాన్ని మండలంలోని రామన్నపేట హమాలీ సంఘం కార్మికుల ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. మేడే రోజున మండలకేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే జెండా ఆవిష్కరణకు పెద్దమొత్తంలో కార్మికులు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ కన్వీనర్ గురజాల శ్రీధర్, హమాలీ సంఘం నాయకులు బొజ్జ ప్రభాకర్, తిరుపతి, గుంటి రాజు, మాదుగుల భూమయ్య, గంగిపెల్లి ముని, పిట్టల జీవన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించారు..

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్ శివారు రహదారి వెంట పేరుకుపోయిన చెత్తను సోమవారం పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. రహదారి వెంట చెత్తాచెదారం పేరుకుపోయినట్లు ×సాక్షి¤ దినపత్రికలో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. గ్రామస్తులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

24న భూ భారతిపై అవగాహన సదస్సు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని రైతువేదికలో ఈనెల 24న భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మారుతిరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ హాజరవుతారని తెలిపారు. మండలంలోని రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరుకావాలన్నారు.

మినీ ట్యాంక్‌బండ్‌గా మారేనా.!

- హామీలకే పరిమితమైన బతుకమ్మకుంట సుందరీకరణ
- ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పైనే ఆశలు
- నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి


మండలకేంద్రంలోని బతుకమ్మకుంట

రుద్రంగి : మండలకేంద్రంలోని బతుకమ్మకుంట సుందరీకరణ నిలిచిపోయింది. మినీట్యాంక్ బండ్‌గా మారుస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు హామీ ఇచ్చారు. హామీలకు అనుకూలంగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో మినీ ట్యాంక్ బండ్ మరుగునపడింది.

'ఆది'పైనే ఆశలు..

వేములవాడ ఎమ్మెల్యే, ఆది శ్రీనివాస్ సొంత గ్రామమైన రుద్రంగి మండలకేంద్రానికి ప్రత్యేక శ్రద్ధతో నిధులు మంజూరు చేయిస్తున్నారు. మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతోనే పూర్తవుతుందని ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తున్న ఆది శ్రీనివాస్ అయితేనే బతుకమ్మకుంటను మినీట్యాంక్ బండ్‌గా మార్చేందుకు నిధులు తీసుకువస్తారని ప్రజలు భావిస్తున్నారు.

బతుకమ్మ వేడుకల్లో ఇబ్బందులు

రుద్రంగిలో ఏటా దసరా తర్వాత బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఈ వేడుకలు మండలకేంద్రంలోని బతుకమ్మ కుంటలో జరుగుతాయి. అయితే ఇక్కడ దసరా తర్వాత బతుకమ్మ వేడుకలు జరగడం, అంతటా బతుకమ్మ వేడుకలు దసరా కంటే ముందు పూర్తవడంతో జిల్లాతో పాటు సమీప జిల్లాలైన నిజామాబాద్, జగిత్యాల జిల్లాల నుంచి పెద్దఎత్తున బతుకమ్మ వేడుకలకు బంధువులు ఇక్కడికి వస్తారు. దీంతో ఇక్కడ బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతాయి. అయితే బతుమ్మకుంటను సుందరీకరించి మినీట్యాంక్ బండ్ చేయకపోవడం, వేడుకల కోసం ఏర్పాట్లు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

హామీలు మరిచారు



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు బతుకమ్మకుంటను మినీట్యాంక్ బండ్ చేస్తామని హామీ ఇచ్చి మరిచారు. బతుకమ్మ వేడుకలకు ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కుంటను సుందరీకరించి మినీట్యాంక్ బండ్‌గా మారిస్తే ప్రజలకు ఆహ్లాదం కలుగుతుంది.

– గడ్డం శ్రీనివాస్ రెడ్డి, రుద్రంగి

నిధులు మంజూరు చేయాలి



ఇప్పటికే మండలకేంద్రంలో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. బతుకమ్మ పండుగ వేడుకల సమయంలో ఇక్కడికి పెద్ద ఎత్తున తరలివచ్చి పండుగ జరుపుకుంటారు. నిధులు మంజూరుచేయించి బతుకమ్మకుంటను మినీట్యాంక్ బండ్‌గా మార్చేందుకు కృషిచేయాలి.

– ఎర్రం గంగ నర్సయ్య, రుద్రంగి

మినీ ట్యాంక్‌బండ్‌గా మారుస్తాం



రుద్రంగి ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు, అలాగే బతుకమ్మ వేడుకలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు రానున్న రోజుల్లో బతుకమ్మ కుంటను మినీట్యాంక్ బండ్‌గా మారుస్తాం. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మినీట్యాంక్ బండ్‌గా మార్చేందుకు నిధులు మంజూరు చేయిస్తాం.

– ఆది శ్రీనివాస్, వేములవాడ ఎమ్మెల్యే

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


చందుర్తి : మర్రిగడ్డలో చిన్నారుల నృత్యాలు


బోయినపల్లి: గుండన్నపల్లిలో..

చందుర్తి: మండలంలోని జోగాపూర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మర్రిగడ్డ ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జోగాపూర్, మర్రిగడ్డ పాఠశాలల ప్రధానోపాధ్యాయురాలు ఎల్గేటి శ్రీలత, భార్గవి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్లు గడ్డం రాధ, సునిత, ఉపాధ్యాయులు ఎడ్ల కిషన్, పాము వెంకటేశ్వర్లు, గుంటి మౌనిక, మ్యాదరి వరలక్ష్మీ, రమాదేవి, గ్రామ ప్రముఖులు కత్తి వేణు, నెరేళ్ల బాబు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని గుండన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ రాజశేఖర్, నాయకులు కొప్పుల స్వామి, ఐలయ్య, రాద అంజయ్య, ఉపాధ్యాయులు పద్మ, అంజలి, మాళవి, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

లారీల కొరత లేకుండా చూడాలి


మాట్లాడుతున్న గుంటి వేణు

తంగళ్లపల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత లేకుండా చూడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. సోమవారం మండలంలోని రాళ్లపేటలో ఆయన మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి ఆరబెట్టి తేమశాతం వచ్చేలా చూసినా 20 శాతం ధాన్యం కూడా గోదాములకు చేరడం లేదని, లారీల కొరత ఉందన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నరేందర్, బాలరాజు, గోపాల్, నర్సింహులు, రాజేందర్, రమేశ్, నాగయ్య, నాగేందర్, ఇస్తారు, శంకర్, రైతులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

ఎల్లారెడ్డిపేట: భారత పౌరసత్వం లేని వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి బండారి బాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. రమేశ్‌బాబు భవిష్యత్తులో వేములవాడ అసెంబ్లీ నుంచి పోటీ చేసే అర్హతలు కల్పించిన ఎన్నికల అధికారులు, అదే విధంగా భారతదేశానికి వచ్చిపోయేందుకు అనుమతులిచ్చిన అధికారులపై కేసులు నమోదు చేయాలన్నారు. ఇంతకాలం ప్రభుత్వ సౌకర్యాలు పొంది జీతభత్యాలు తీసుకుని మోసం చేసిన అతనికి జైలు శిక్ష విధించాలన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ నిధులు ఎన్ని కాజేశాడో విచారణ జరిపి రమేశ్‌బాబు నుంచి రికవరీ చేయాలని కోరారు. ఇక్కడ మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్ద రాజ్‌కుమార్, తెలంగాణ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు కోనేటి పోచయ్య ఉన్నారు.


మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

నియోజకవర్గ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

రుద్రంగి: తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యేగా మూడు పర్యాయాలు గెలిచి నియోజకవర్గ ప్రజలను మోసం చేస్తూ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు నియోజకవర్గ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమ్ జలపతి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

ప్రజలు భయాందోళన చెందొద్దు

చందుర్తి: చందుర్తికి మళ్లీ దొంగలొచ్చారన్న పుకార్లు రావడంతో చేయడంతో ప్రజలకు కంటిమీద కునుకు కరువవుతోంది. ఇప్పటికే మండలకేంద్రంలో నాలుగు రోజుల క్రితం దొంగలుపడి రెండిళ్లల్లో నగదు ఎత్తుకెళ్లగా, మరో ఇంటి ముందున్న బైక్‌ను ఎత్తుకెళ్లిన ఘటనతో ఆందోళన చెందుతున్నారు. ఈ ఘనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తుండగా, ఆదివారం రాత్రి దొంగలు చోరీకి వచ్చారంటూ మండలకేంద్రంలోని ఓ మహిళ ప్రచారానికి తెరలేపింది. ఈ విషయం ఉరంతా ప్రచారం జరగగా గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. కాగా ఎస్సై అంజయ్యను వివరణకోరగా రాత్రంతా పోలీసులు పెట్రోలింగ్ ఉంది. రాకపోకలు సాగించే వారి కదలికలపై పూర్తిస్థాయి నిఘా తీవ్రతరం చేశామన్నారు. దొంగలు వచ్చే ప్రసక్తే లేదని ప్రజలకు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

సంక్షిప్త వార్తలు

నిజామాబాద్‌కు తరలిన రైతులు




వీర్నపల్లి: రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లాలోని స్థానిక జీజీ కళాశాల గ్రౌండ్‌లో జరిగే రైతు మహోత్సవ కార్యక్రమానికి వీర్నపల్లి మండలంలోని వివిధగ్రామాల నుంచి దాదాపు 120 మంది వెళ్లినట్లు మండల వ్యవసాయ అధికారి జయ సోమవారం తెలిపారు.

టిప్పర్ పట్టివేత

ముస్తాబాద్: మండలంలోని కొండాపూర్ మానేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన చింతల శ్రీనివాస్ టిప్పర్లో ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

గుండెపోటుతో మహిళ మృతి


రేఖ (ఫైల్)

కోనరావుపేట: మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన మహిళ గుండెపోటుతో మృతిచెందింది. గ్రామానికి చెందిన వంగపెల్లి రేఖ (35) సోమవారం ఇంట్లోనే గుండెపోటు రాగా కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందింది. మృతురాలికి భర్త శంకర్, కుమారులు రోహిత్(8), సాత్విక్ (6) ఉన్నారు.

ఇసుక రీచ్‌లు ప్రారంభించాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్, నారాయణపూర్, రాగట్లపల్లి, పదిర గ్రామాల శివారులోని మానేరువాగుల నుంచి ఇసుకను తరలించేందుకు ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ల అనుమతులను ఇటీవల రెవెన్యూ అధికారులు రద్దు చేశారు. దీంతో ఇసుక దొరకక సామాన్యులు ఇబ్బందిల పడుతున్నారు. రీచ్‌ల ఎత్తివేతతో ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక లోడుకు రూ.3వేల నుంచి రూ. 3,500 వరకు పలుకుతోంది. దీంతో కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారు ఇబ్బంది పడుతున్నారు. ఇసుక రీచ్‌లను తిరిగి ప్రారంభించడానికి మూడుసార్లు రెవెన్యూ అధికారులు ట్రాక్టర్ల యజమానులు, ఆయా గ్రామాల ప్రజలు, వివిధ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొని రద్దుచేసిన ఇసుక రీచ్‌లను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

బోయినపల్లి: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరని ఎంఈవో శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని స్తంభంపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అల్తాఫ్ అహ్మద్ ఉద్యోగ విరమణ సభ సోమవారం పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం నరోత్తంరెడ్డి, విలాసాగర్ హెచ్ఎం మల్లేశం, ఆర్‌యూపీపీ మండల శాఖ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి సతీశ్‌కుమార్, షఫియొద్దిన్, పీడీ ప్రభాకర్, వెంకటహనుమాన్, మాజీ జెడ్పీటీసీ పులి లక్ష్మీపతి, సీఆర్పీలు తిరుపతి, రాంప్రసాద్, గ్రామ నాయకులు, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

చలివేంద్రాల నిర్వహణపై నిర్లక్ష్యం


గంభీరావుపేట బస్‌షెల్టర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం పరిస్థితి ఇలా..

గంభీరావుపేట: ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రభుత్వం మండల కేంద్రాల్లో, మేజర్ గ్రామపంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసింది. అందులో భాగంగా మండలకేంద్రంలోని బస్ షెల్టర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రంపై నిర్వహణపై పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. తూతూ మంత్రంగా రెండు కుండలు ఏర్పాటు చేసి ఒకటి, రెండు రోజులు నీటిని అందించారు. తర్వాత కుండలను పక్కన బోర్లేశారు. ప్రయాణికులు బస్‌షెల్టర్‌లోకి వచ్చి చలివేంద్రం పరిస్థితిని చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు చలివేంద్రం నిర్వహణపై దృష్టిసారించి ప్రజల దాహార్తి తీర్చాలని కోరుతున్నారు.

కలశయాత్ర

వీర్నపల్లి: మండలకేంద్రంలో తాళ్ల లక్ష్మీరాజం ఆధ్వర్యంలో సోమవారం భక్తి శ్రద్ధలతో జ్యోతి కలశ యాత్రను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం హనుమాన్ దేవాలయంలో భక్తులతో మాట్లాడుతూ.. ఆదివారం అగ్రహారం గ్రామంలో నిర్వహించే 108 కుండలములతో గాయత్రి మహాయజ్ఞం ఉంటుందని, భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల హామీలు అమలుచేయాలి


సిరిసిల్ల టౌన్: హైదరాబాద్‌కు తరలుతున్న తెలంగాణ ఉద్యమకారులు

సిరిసిల్ల టౌన్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం ప్లీనరీ సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. కార్యక్రమానికి సిరిసిల్ల జిల్లా నుండి పెద్దఎత్తున ఉద్యమకారులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గం అధ్యక్షుడు వెంగల శ్రీనివాస్ మాట్లాడుతూ జూన్ 2 వరకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకుంటే మరో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యమకారులు కొక్కుల ఆంజనేయులు, బింగి ఇజ్జగిరి, గజభీంకార్ బాబు, గుజ్జే దత్తాద్రి, వెంకటేశం తదితరులున్నారు.

వీర్నపల్లి: హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ఉద్యమ కళాకారుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ముఖ్య సమావేశానికి మండల సాంస్కృతిక శాఖ అధ్యక్షుడు నేరెళ్ల ముత్యం ఆధ్వర్యంలో మండల ఉద్యమ ఫోరం కళాకారులు తరలివెళ్లారు. గ్రామశాఖ అధ్యక్షుడు దర్శనాల లింబాద్రి, ప్రధాన కార్యదర్శి, వీటూరి సతీశ్, కళాకారులు సలహాదారులు మాడుగుల మల్లేశం, భూత ఎల్లయ్య, రాజమల్లయ్య, చిదుర నాగరాజు, పోతారం రాములు, జక్కుల నరేశ్, ఘనగోని సతీశ్‌గౌడ్, దేశరాజు మారుతి తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠం


ఇల్లంతకుంట : గాలిపెల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇల్లంతకుంట: బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠమని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఉమారాణి అన్నారు. సోమవారం మండలంలోని కందికట్కూర్ అంగన్‌వాడీ సెక్టార్ పరిధిలోని గాలిపెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జీవనజ్యోతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకళ, గ్రామపంచాయతీ సెక్రటరీ అనిల్, అంగన్‌వాడీ టీచర్ విజయ 18 మంది అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్షం సందర్భంగా పోషకాహార లోపంపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఎంఎల్‌హెచ్‌వీ వినూత్న, పుష్ప, ఈ. తిరుమల, వీ.సుమలత తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాలను సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కళావతి అన్నారు. దుమాల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా సోమవారం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు రక్తహీనత రాకుండా బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కవిత, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటలు, విద్య ద్వారా పిల్లలపై ఒత్తిడి ఉండదన్నారు. చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ మంజుల, జ్యోతి, శారద, అనసూయ, కవిత, సరిత, తల్లులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంపై ఇంటర్వ్యూలు


చందుర్తి : ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు


వేములవాడ రూరల్ : ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

చందుర్తి : రాజీవ్ యువవికాసం పథకం కింద దరఖాస్తులు చేసుకున్న మండలంలోని రామన్నపేట, చందుర్తి గ్రామాలవారికి మండల ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. చందుర్తి గ్రామానికి చెందిన 218 మంది యువకులు దరఖాస్తులు చేసుకోగా ఇంటర్వ్యూలకు 177 మంది హాజరయ్యారు. రామన్నపేటకు చెందిన యువత 52 మంది దరఖాస్తులు చేసుకోగా 43 మంది హాజరయ్యారు. చందుర్తికి చెందిన 41 మంది గైర్హాజరుకాగా రామన్నపేటకు చెందిన తొమ్మిది మంది గైర్హజరయ్యారు. ఇన్‌చార్జి ఎంపీడీవో బండి ప్రదీప్‌కుమార్, ఐకేపీ ఏపీఎం రజిత, బ్యాంకు ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్, ఎంపీడీవో కార్యాలయానికి చెందిన జూనియర్ అసిస్టెంట్ రమాదేవి తదితరుల అధికారులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాస్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మర్రిపల్లి, బాలరాజుపల్లి, అచ్చన్నపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 190 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, అభ్యర్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారుల ఇంటర్వ్యూలు కొనసాగాయి. అంకుషాపూర్, గోపాలరావుపల్లె, లక్ష్మీపూర్, పాపయ్యపల్లె, తాడూర్, వేణుగోపాలపూర్ గ్రామస్తుల దరఖాస్తులు పరిశీలించారు. ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ, ఎస్‌బీఐ జిల్లెల్ల బ్రాంచ్ మేనేజర్ రంజిత్ రెడ్డి, సూపరింటెండెంట్ దొంతుల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 23, 24తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి రాజీవ్ యువవికాసం దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భీమ జయశీల సోమవారం తెలిపారు. ఎస్‌బీఐ, యూబీఐ మేనేజర్లు, మండల కమిటీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఆమె పేర్కొన్నారు.

వరంగల్ సభను విజయవంతం చేయాలి


కోనరావుపేటలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు


తంగళ్లపల్లి : సమావేశమైన నాయకులు

కోనరావుపేట: వరంగల్ సభలో మన సత్తా చాటుదామని, ఈనెల 27న వరంగల్ ఎల్కతుర్తి లోజరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు కోనరావుపేట మండలంలోని అన్ని గ్రామాల నుండి అధిక సంఖ్యలో తరలి వెళ్లాలని వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రామ గ్రామాన బీఆర్ఎస్ జెండా ఎగురవేసి వరంగల్ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల ప్రజాపతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న ఆధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్ సన్నాహక రజతోత్సవ సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండలకేంద్రం నుంచి 300 మంది కార్యకర్తలు తరలివెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అంకారపు రవి, ఎగుమామిడి వెంకట రమణా రెడ్డి, పడిగెల రాజు, క్యారం జగత్, కోడం సంధ్యారాణి, అనిల్, రమేశ్, తిరుపతి, శోభ తదితరులు పాల్గొన్నారు.

పరికరాలు అందజేత

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో 2024–25లో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాలకు గణిత, సాంఘిక, భౌతిక శాస్త్ర, ప్రయోగ పరికరాలను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం ప్రేమలతకు అందజేశారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.